సాక్షి నంద్యాల

సోమవారం । 9 । జనవరి । 2023



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు.



ముగ్గుల పోటీలు

కర్నూలు కల్చరల్: సాయిబాబా భక్త మండలి ఆధ్వర్యంలో ఆదివారం సాయిబాబా దేవస్థానం వద్ద మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,622.94
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:69.958
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,377

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌



నేషనల్ కళాశాలలో గ్రూప్‌-1 పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

నంద్యాల(సిటీ): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌కు సంబంధించిన పరీక్షలు జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా కేంద్రం నంద్యాలలోని నేషనల్ కళాశాల, గుడ్‌షెఫర్డ్ పాఠశాల, ఎస్వీఆర్ ఇంజినీరింగ్, ఆర్జీఎం ఇంజినీరింగ్, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించినట్లు డీఆర్‌ఓ పుల్లయ్య తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు మొత్తం 2,904 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 2,145 మంది హాజరయ్యారన్నారు. 759 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరగడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

కొత్తూరులో హైకోర్టు రిజిస్ట్రార్ పూజలు



హైకోర్టు రిజిస్ట్రార్ లక్ష్మణరావుకు తీర్థప్రసాదాలు అందిస్తున్న దృశ్యం

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి వారి సన్నిధిలో ఆదివారం రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జి. లక్ష్మణరావు పూజలు చేశారు. ఆయన వెంట నంద్యాల అడిషనల్ సబ్ జడ్జి రాధారాణి, భాస్కర్ దంపతులు అధికార సిబ్బంది ఉన్నారు. అనంతరం ఆయన స్వామి వారికి విశిష్ట పూజలు చేశారు. ఆలయ చరిత్ర గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆలయ అర్చకులు నారాయణస్వామి, సురేష్‌స్వామి, వీరయ్య ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, మహానంది ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

నంద్యాల(అర్బన్): స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరించేందుకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా యథాతథంగా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

స్టాఫ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నేడు పరీక్ష

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో స్టాఫ్ అసిస్టెంటు పోస్టుల భర్తీకి సోమవారం ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈఓ రామాంజనేయులు తెలిపారు. మొత్తం 18 పోస్టులకు 1,586 మంది పోటీ పడుతున్నారు. కర్నూలులోని అయాన్ డిజిటల్ జోన్, వైఎస్సార్ జిల్లాలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో సెంటర్లు ఏర్పాటయ్యాయి. ఉదయం 8 నుంచి 10.30 వరకు, 11.30 నుంచి 2 గంటల వరకు ఈ పరీక్ష జరుగుతుంది.

పల్లెకు ప్రగతి దారులు

బండిఆత్మకూరు మండలం పార్నపల్లె నుంచి కాకనూరు మీదుగా ఎర్రగుంట్లకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. ప్రజల ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం రూ.2.90 కోట్లతో 5.20 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం మొదటి లేయర్ పూర్తి కాగా, జనవరి నెలాఖరుకు ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయనున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే ఎర్రగుంట్ల, కాకనూరు, భీమవరం, కరిమద్దెల, పెసరవాయి గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది.

- పీఎంజీఎస్‌వై కింద రూ.114.60 కోట్లతో పనులు
- ఇప్పటికే 148 కి.మీ రహదారుల నిర్మాణం పూర్తి
- వేర్వేరు దశల్లో కొనసాగుతున్న 6 రోడ్ల పనులు
- ప్రారంభమైన కుందరవాగు నిర్మాణం



వేగంగా జరుగుతున్న పార్నపల్లె - ఎర్రగుంట్ల రోడ్డు పనులు

కర్నూలు(అర్బన్): దశాబ్దాలుగా గుంతలు పడి, కంకర తేలి నడిచేందుకు కూడా ఇబ్బందికరంగా ఉన్న గ్రామీణ రోడ్లు సరికొత్త రూపును దిద్దుకుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో రూ 114.60 కోట్లతో 195.44 కిలోమీటర్ల మేర 22 రోడ్లు నిర్మిస్తున్నారు. అలాగే కొండుపల్లి నుంచి ఆర్ పాంపల్లికి వెళ్లే దారిలో కుందరవాగుపై రూ.2.56 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే నాలుగు గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగిపోనున్నాయి. అలాగే మంజూరైన 22 గ్రామీణ రోడ్ల పనుల్లో ఇప్పటికే 16 పనులు పూర్తయ్యాయి. మిగిలిన 6 రోడ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్ల నిర్మాణాలు పూర్తి కావడంతో ఆయా మండలాల్లోని దాదాపు 60 నుంచి 70 గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోనున్నాయి. వేర్వేరు దశల్లో కొనసాగుతున్న ఈ రోడ్ల పనులను నిర్ణీత వ్యవధిలోనే పూర్తి చేసేందుకు ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ (పీఐయూ) ఇంజినీర్లు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

పూర్తి అయిన రోడ్డు పనులు ...

మండలం	పూర్తి అయిన పని
ఆళ్లగడ్డ	ఎన్‌హెచ్ 18 నుంచి జీ జంబులదిన్నె రోడ్డులో వక్కిలేరు వాగుపై కాజ్‌వే
ఆళ్లగడ్డ	ఎన్‌హెచ్ 18 నుంచి నందింపల్లి రోడ్డులో నల్లవాగుపై కాజ్‌వే
అవుకు	జీ శింగవరం - అవుకు
చిప్పగిరి	హంచనహాల్ రోడ్ నుంచి చిప్పగిరి వయా బంటనహాల్ ఆర్ఎస్
హొలహార్వి	హొలహార్వి నుంచి మెదేహాల్ వయా హర్దగేరి
ఉయ్యాలవాడ	కొండుపల్లి నుంచి ఉయ్యాలవాడ వయా ఆర్ పాంపల్లి
నందికొట్కూరు	కొణిదేల నుంచి పగిడ్యాల
జూపాడుబంగ్లా	క్రిష్ణరావుపేట నుంచి మిట్టకందాల వయా సీ అనందపురం, కే సిద్దేశ్వరం
బేతంచెర్ల	బలపాలపల్లె నుంచి బుగ్గానిపల్లె వయా కొలుములపల్లె
గోనెగండ్ల	పెద్దమరివీడు నుంచి పెద్దనెలటూరు వయా చిన్నమరివీడు
గోస్పాడు	దీబగుంట్ల నుంచి ఓఎన్ రోడ్ వయా మసీదుపురం, మోతుకులపల్లి
గూడూరు	గూడురు నుంచి పెద్దనెలటూరు వయా పులకుర్తి
కోసిగి	సాతనూరు నుంచి దుద్ది వయా సాతనూరు కొట్టాల, చిర్తనకల్
కౌతాళం	ఉరుకుంద నుంచి కౌతాళం
తుగ్గలి	పగిడిరాయి నుంచి కలచట్ల వయా హుసేనాపురం, కడమకుంట్ల
ఎమ్మిగనూరు	గుడేకల్ నుంచి గంజహళ్లి వయా ఎస్ నాగులాపురం

ఇబ్బందులు తప్పాయి



సాతనూరు నుంచి దుద్దికి వెళ్లే రోడ్డు గతంలో చాలా అధ్వానంగా ఉండేది. ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పడడం వల్ల వర్షాకాలంలో ఎద్దుల బండ్లు, మోటారు సైకిళ్లు రావాలంటే చాలా కష్టంగా ఉండేది. రోడ్డుపై గుంతలు కనపడక అనేక మంది ప్రమాదాలకు గురయ్యారు. ఈ రోడ్డు బాగు చేయడం వల్ల పొలాలకు వెళ్లేందుకు కూడా కష్టాలు తప్పాయి.

– వడ్డే సూర్యనారాయణ, సాతనూరు

మూడు నెలల్లో అన్ని పనులు పూర్తి



ఉమ్మడి కర్నూలు జిల్లాలో చేపట్టిన 22 రోడ్ల పనుల్లో ఇప్పటికే 16 పూర్తయ్యాయి. మిగిలిన అరు కూడా వేగంగా జరుగుతున్నాయి. పీఎంజీఎస్‌వై కింద చేపట్టిన పనులకు నిధుల కొరత లేదు. తాజాగా రూ.15 కోట్లు విడుదల అయ్యాయి. కుందరవాగు పనులు కూడా ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. ఈ పనుల్లో కూ డా వేగం పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. – పీ రామక్రిష్ణారెడ్డి, పీఐయూ ఈఈ



నాడు గుంతల మయంగా ఉన్న సాతనూరు - దుద్ది రోడ్డు

కోసిగి మండలంలోని సాతనూరు నుంచి దుద్ది వరకు రూ.2.22 కోట్లతో 9.30 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తి కావడం వల్ల సాతనూరు, దుద్ది, సాతనూరు కొట్టాల, చిర్తనకల్ గ్రామాల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో గుంతలు పడి నడిచేందుకు కూడా ఇబ్బందిగా ఉన్న ఈ రోడ్డు ప్రస్తుతం అందంగా రూపుదిద్దుకుంది.



నేడు అందంగా రూపుదిద్దుకున్న సాతనూరు - దుద్ది రోడ్డు

భూముల కొనుగోలుకు రూ.248.50 కోట్లతో ప్రతిపాదనలు

కర్నూలు(అర్బన్): జిల్లా షెడ్యూల్డు కులాల ఆర్థిక సేవా సహకార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఎస్సీలకు భూమి కొనుగోలు పథకం కింద భూములు ఇప్పించేందుకు రూ.248.52 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్ శ్రీనివాసకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో 155 మంది లబ్ధిదారులకు 354.25 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 143 మంది లబ్ధిదారులకు 284.50 ఎకరాలను అందించేందుకు గతంలోనే తహసీల్దార్లు జాబితాలను పంపారన్నారు. పెరిగిన భూముల ధరల మేరకు కర్నూలు జిల్లాలో ఒక ఎకరా రూ.30 లక్షలు, నంద్యాల జిల్లాలో ఒక ఎకరా రూ.50 లక్షల ప్రకారం అంచనాలు వేసి పంపామన్నారు. రెండు జిల్లాల్లో మొత్తం 298 మంది భూమి లేని ఎస్సీలకు 638.75 ఎకరాలను అందించడం జరుగుతుందన్నారు.


నమో.. నీలకంఠా!



భక్తుల హర్షధ్వానాల మధ్య మహాదేవుని రథోత్సవం ఎమ్మిగనూరు పట్టణంలో ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా సాగింది. నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లా భక్తులతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. - ఎమ్మిగనూరు

12 నుంచి సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

- 15న స్వామిఅమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం
- ఏడు రోజుల పాటు ఆర్జిత సేవలు నిలుపుదల



శ్రీశైలం టెంపుల్: మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. సంప్రదాయం మేరకు మల్లికార్జున స్వామికి ఏటా రెండు సార్లు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. మకర సంక్రమణం సందర్భంగా సంక్రాంతి బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి సందర్భంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. సంప్రదాయం అనుసరించి స్వామిఅమ్మవార్లకు విశేష అలంకరణలు, వాహనసేవలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు ఆర్జిత, ప్రత్యక్ష, పరోక్ష సేవలైన రుద్రహోమం, చండీహోమం, మృత్యుంజయహోమం, శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, స్వామి అమ్మవార్ల కల్యాణం, ఏకాంత సేవలు నిలుపుదల చేశారు. 15వ తేదీన మకర సంక్రాంతిని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం నిర్వహించనున్నారు. 17న వేద శ్రవణం కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

వాహన సేవల వివరాలు

తేదీ	సేవలు
12న	ధ్వజారోహణ
13న	భృంగివాహన సేవ
14న	రావణవాహన సేవ
15న	నందివాహన సేవ, బ్రహ్మోత్సవ కల్యాణం
16న	కైలాసవాహన సేవ
17న	పూర్ణాహుతి, త్రిశూల స్నానం, సదస్యం, నాగవల్లి, ధ్వజావరోహణ
18న	అశ్వవాహనసేవ, పుష్పోత్సవం, శయనోత్సవం

ముగిసిన నాటకోత్సవాలు

నంద్యాల(వ్యవసాయం): అజో విభో కందాలం అమెరికా ఫౌండేషన్, కళారాధన సాంస్కృతిక సంస్థ సంయుక్త నిర్వహణలో నాలుగు రోజులుగా టౌన్ హాల్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సాహితీ నాటకోత్సవాలు ఆదివారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడూరు ప్రభాకర్‌రెడ్డికి ప్రతిభా మూర్తి జీవిత కాల సాధన పురస్కారం, రూ.లక్ష నగదు అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కళారాధన సంస్థ నంద్యాలలో కళా వికాసానికి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రవికృష్ణ, మధుమణి, అనంత పద్మనాభరావు, గిరిజా మనోహర్ బాబు, డాక్టర్ గెలివి సహదేవుడు, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అప్పాజ్ జోష్యుల సత్యనారాయణ పాల్గొన్నారు.



పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



ఏళ్లనాటి కల నెరవేరుతోంది

సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన ఈమె పేరు సావిత్రి. నిరుపేద కుటుంబం. ఊరిలో సొంత ఇల్లు లేకపోవడంతో భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి పాతబడిన ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. అర్హులందరికీ ఇల్లు పథకంలో భాగంగా ఇటీవల ప్రభుత్వం సావిత్రికి ఇంటిస్థలం, పక్కాగృహం మంజూరు చేసింది. అంతేకాదు రెండు దఫాలుగా బిల్లు రూపంలో రూ. 1.26 లక్షలు, 10 టన్నుల ఇసుక అందజేసింది. సొంతిల్లు నిర్మించుకోవాలని ఎంతో కాలంగా ఎదురు చూసిన తమ కల ఇప్పుడు నెరవేరుతోందని సావిత్రి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సొంతింటికి మరింత సాయం!

- పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు
- నిర్మాణానికి అన్ని విధాలుగా సాయం
- తాజాగా అదనపు రుణ సదుపాయానికి శ్రీకారం
- నంద్యాల జిల్లాకు 49,170 పక్కాగృహాలు మంజూరు
- శరవేగంగా జరుగుతున్న పనులు

పేదల సొంతింటి కల సాకారమవుతోంది. ఇప్పటికే నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణానికి కూడా సాయమందిస్తోంది. తాజాగా త్వరితగతిన గృహ నిర్మాణాలను పూర్తి చేసేందుకు హౌస్‌లోన్ పర్పస్(హెచ్ఎల్‌పీ) ద్వారా అదనపు రుణ సదుపాయానికి శ్రీకారం చుట్టింది.



పాణ్యంవద్ద జగనన్న కాలనీలో నిర్మితమవుతున్న పక్కాగృహాలు

కోవెలకుంట్ల: నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో జగనన్న కాలనీలతోపాటు, సొంత స్థలం ఉన్న లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేందుకు 49,170 పక్కాగృహాలు మంజూరు చేసింది. ఇప్పటి వరకు ఆయా మండలాల్లో 23,389 గృహాలు బిలో బేస్‌మెంట్, 9,322 ఇళ్లుబేస్‌మెంట్, 2,504 రూఫ్‌లెవల్ దశల్లో ఉండగా 8,466 పక్కాగృహాలు పూర్తయ్యాయి. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 1.80 లక్షలను మూడు విడతల్లో అందజేస్తోంది. బేస్‌మేట్ వేసుకునేందుకు చేతిలో డబ్బులులేని లబ్ధిదారులకు వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా హౌస్‌లోన్ పర్పస్(హెచ్ఎల్‌పీ) ద్వారా రూ. 35 వేలు మంజూరు చేస్తోంది. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు లబ్ధిదారులకు మరింత ఆర్థిక వెసులుబాటు కల్పిస్తోంది.

రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు అదనపు రుణం

జగన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులకు ఏ మాత్రం భారం పడకుండా ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. ఇంటి నిర్మాణం ఎక్కడ ఆగిందో తెలుసుకుని దానిని పూర్తి చేసేందుకు డీఆర్‌డీఏ, మెప్మా ద్వారా సాయమందిస్తోంది. జిల్లాలో మొత్తం 49 వేల పక్కా గృహాలు మంజూరు కాగా 35 వేల మంది లబ్ధిదారులు పొదుపు సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం మూడు విడతల్లో రూ. 1.80 లక్షల ఆర్థికసాయం అందజేస్తోంది. దీంతో పాటు రూ. 35 వేలు రుణం అందజేస్తోంది. ఈ మొత్తం చాలని పక్షంలో అదనపు రుణం అందించేందుకు డీఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపట్టారు. ఇంటి నిర్మాణ దశను బట్టి రూ. 50 వేల నుంచి గరిష్ఠంగా రూ. లక్ష వరకు రుణ సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు. ఇందులో రూ. 35 వేల రుణం వరకు పావలా వడ్డీ వర్తిస్తుంది. ఎస్సీ, ఎస్టీ స్వయం సహాయక సంఘాలకు (ఉన్నతి) వడ్డీ లేకుండా అదనపు రుణం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణాలు మధ్యలో ఆగిన పొదుపు గ్రూపు సభ్యులు అదనపు రుణం కోసం సంబంధిత వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి రుణ వసతి కల్పిస్తారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతోంది. జగనన్న కాలనీలతో పాటు సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు మూడు విడతల్లో బిల్లు అందజేస్తోంది. బేస్‌మెంట్ దశలో సిమెంట్, స్టీల్‌తో కలుపుకుని రూ. 70వేలు, లింటల్ లెవల్‌లో రూ. 54 వేలు, రూఫ్ లెవల్‌లో రూ. 25వేలతో పాటు, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ. 30 వేల చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లు మొత్తం జమ అవుతోంది. ఆయా దశల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వెంటనే గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు బిల్లు అప్‌లోడ్ చేసిన నెల రోజుల్లోపే వారి ఖాతాల్లోకి నగదు చేరుతోంది. మార్కెట్‌లో సిమెంట్ బస్తా రూ. 430 ఉండగా ప్రభుత్వం లబ్ధిదారులకు బస్తా రూ. 260 ప్రకారం 90 బస్తాలు, కిలో స్టీల్ రూ. 90 ఉండగా రూ. 60 ప్రకారం 420 కిలోల స్టీల్‌ను సరఫరా చేస్తోంది. వీటితో పాటు ఇళ్ల నిర్మాణానికి సంబంధించి కిటికీలు, చౌకట్లు, బాత్‌రూం డోర్ ఫ్రేమ్‌లు, ఎలక్ట్రికల్ సామగ్రిని రాయితీపై అందజేస్తోంది.

వేగవంతంగా మౌలిక వసతులు

ఊరూరా ఏర్పాటువుతున్న జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనను అధికారులు వేగవంతం చేశారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో 25 శాతం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమైన జగనన్న కాలనీల్లో ఇప్పటికే చేతిపంపులు ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు ఓవర్‌హెడ్ ట్యాంకు, పైప్‌లైన్, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చే పనులపై దృష్టి సారించారు. కాలనీలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చుతున్నారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో కాలనీలకు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు, డ్రెయినేజి ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

మొదటి బిల్లు వచ్చింది



కోవెలకుంట్ల పట్టణ శివారులోని జగనన్న కాలనీలో ఇంటి స్థలంతో పాటు పక్కా గృహం మంజూరైంది. బేస్‌మెంట్ దశ వరకు ఇంటిని నిర్మించుకున్నాను. ఇప్పటి వరకు రూ. 60వేలు మొదటి బిల్లు, 30 బస్తాల సిమెంట్, 104 కిలోల స్టీల్, ఐదు టన్నుల ఇసుక అందించారు. ఎస్సీ, ఎస్టీలకు వడ్డీలేకుండా రుణ సౌకర్యం కల్పిస్తున్నారు. ఇంటి నిర్మాణానికి రూ. 50 వేలు రుణం అందించాలి.

– వెంకటలక్ష్మి, హౌసింగ్ లబ్ధిదారురాలు, కోవెలకుంట్ల

పొదుపు మహిళలకు రుణాలు



జగనన్న కాలనీల్లో పక్కాగృహాలు నిర్మించుకునే పొదుపు మహిళలకు డీఆర్‌డీఏ ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తున్నాం. బేస్‌మెంట్ వేసుకునేందుకు చేతిలో డబ్బులు లేని మహిళలకు హౌస్‌లోన్ పర్పస్ కింద రూ. 35 వేలు రుణం అందించాం. ఇళ్ల నిర్మాణాలు మధ్యలో ఆగిన లబ్ధిదారులకు అదనపు రుణం ఇచ్చేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అనుమతి వచ్చిన వెంటనే ఆ దిశగా రుణాలు ఇస్తాం.

– బాబు, ఏపీఎం, సంజామల

క్లుప్తంగా

సాఫ్ట్ టెన్నిస్ జిల్లా కార్యదర్శిగా నవీన్‌కుమార్



నవీన్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): సాఫ్ట్ టెన్నిస్ కర్నూలు జిల్లా కార్యదర్శిగా నవీన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. నవీన్‌కుమార్ జిల్లా కార్యదర్శిగానే కాకుండా రాష్ట్రకార్యవర్గ సభ్యుడిగా, కోచ్ కమిటీ సభ్యుడిగా కూడా ఎన్నికయ్యారు. జిల్లాలో సాఫ్ట్ టెన్నిస్ క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులను నవీన్ కుమార్‌ను సన్మానించారు.

మహానందిలో చండీ హోమం



చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది: మహానందిలో ఆదివారం చండి హోమం వైభవంగా నిర్వహించారు. స్థానిక యాగశాలలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, చండీహోమం నిర్వహించారు. అలాగే శ్రీగంగా, కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లకు కల్యాణం నిర్వహించారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కర్నూలు వాసికి చోటు



మెమెంటో, ప్రశంసా పత్రం అందుకుంటున్న గుర్రాల శ్రీనివాసులు

కర్నూలు(అర్బన్): తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కర్నూలుకు చెందిన గుర్రాల శ్రీనివాసులు చోటు సంపాదించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలో ఈ నెల 8వ తేదీన భద్రాద్రి స్వరాంజలి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర నీరాజనం కార్యక్రమంలో ఈయన నిర్విరామంగా భక్తి, సినిమా పాటలు పాడారు. ఈ కార్యక్రమానికి ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి గాయకులు హాజరయ్యారు. నిర్విరామంగా పాటలు పాడినందుకు గుర్రాల శ్రీనివాసులకు నిర్వాహకులు అనుమాండ్ల నాగరాజు, పోకల పద్మావతి ప్రశంసా పత్రం, మెమెంటోను అందజేశారు. తాను కర్నూలు నగరంలోని పుష్పరాజ్ పర్యవేక్షణలో ఏడు నెలలు శిక్షణ పొందానని, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకోవడం సంతోషంగా ఉందని శ్రీనివాసులు తెలిపారు.

'విరి'సిన మామిడి రైతుల ఆశలు

- పూతతో కళకళలాడుతున్న తోటలు
- ఉమ్మడి జిల్లాలో 12 వేల ఎకరాల్లో సాగు
- ఈ ఏడాది లక్ష టన్నుల దిగుబడి వచ్చే అవకాశం
- ఫ్రూట్ కవర్లు వినియోగిస్తే నాణ్యతకు ఢోకా ఉండదు



వెల్దుర్తి మండలం రామళ్లకోటలో పూతతో కళకళలాడుతున్న మామిడి తోట

కర్నూలు(అగ్రికల్చర్): మామిడి తోటలు పూతతో కళకళలాడుతున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కరోనా కారణంగా 2020, 2021లో మామిడికి సరైన మార్కెటింగ్ లేక రైతులు నష్టపోయారు. 2022లో పూత ఆలస్యంగా రావడంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఈ సారి మాత్రం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో మామిడిలో ముందస్తుగా పూత వచ్చింది. అది కూడా సమృద్ధిగా రావడంతో ఈ సారి మామిడి పండినట్లేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మామిడితోటలకు క్యూ కడుతున్న వ్యాపారులు

గతంలో ఎన్నడూ లేని విధంగా పూత రావడంతో మామిడితోటల కొనుగోలుకు వ్యాపారులు క్యూ కడుతుఅన్నరు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల వ్యాపారులు కూడా వస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో 12వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ముందస్తుగా పూత రావడంతో ఈ సారి పంట కూడా ముందస్తుగానే మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పిందెలు కూడా ఏర్పడ్డాయి. గత ఏడాది బేనీసా రకం మామిడి ధర టన్నుకు రూ.1.10 లక్షలకుపైగా లభించింది. ఫ్రూట్ కవర్లు వినియోగించి నాణ్యతను పెంచుకుంటే ఈ సారి కూడా మంచి ధర వచ్చే అవకాశం ఉంది. నాణ్యత ఉంటే విదేశాలకు ఎగుమతి చేయవచ్చు.



నిండుగా వచ్చిన మామిడి పూత

ఎకరాలకు 8 టన్నుల దిగుబడి

ఈ సారి ఉమ్మడి జిల్లా మొత్తం మీద మామిడిలో లక్ష టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. పూత, పిందె చక్కగా నిలబడితే ఎకరాకు 8 టన్నుల వస్తుంది. ఉద్యాన అధికారుల లెక్కల ప్రకారం సగటున ఎకరాకు 6 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ ప్రకారం ఉమ్మడి జిల్లాలో మామిడి 72 వేల నుంచి లక్ష టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మామిడిలో ప్రధానంగా బేనిషాన్, తోతపురి, మల్లిక, అమృతాలు, కేసరి, రసాలు వంటి రకాలు ఉన్నాయి.

పండు ఈగ బెడద లేకుండా..

మామిడికి ప్రధాన సమస్య పండు ఈగ. గతేడాది ఇది మామిడికి తీవ్ర నష్టం కలిగించింది. అకాల వర్షాలు మొదలైన తర్వాత దీని ప్రభావం ఉంటుంది. దీని నుంచి కాపాడుకోవడానికి ఫ్రూట్ కవర్లు వినియోగించవచ్చని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు. మామిడి కాయలు నిమ్మకాయ సైజుకు వచ్చిన సమయంలో ఫ్రూట్ కవర్ వినియోగిస్తే పండుఈగతో పాటు చీడపీడల బెడదు ఉండదు. కాయ ఆకర్షణీయంగా ఉండి గిట్టుబాటు ధర లభిస్తుంది.

తేనె మంచు పురుగులను నివారించుకోవాలి

మామిడికి తేనె మంచు పురుగులు, బూడిద తెగులు ప్రధాన సమస్యలు. వీటిని నివారించుకోకపోతే కాయల్లో నాణ్యత ఉండదు. తేనె మంచు పురుగుల నివారణకు థయోమిథాక్సమ్ లీటరు నీటికి 0.3 గ్రాములు, కార్బండిజమ్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నపుడు బూడిద తెగులు ప్రమాదం ఉంది. దీని నివారణకు ఎక్సాకొనజోల్ 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాల్సిన అవసరం ఉంది. పూత, పిందె రాలకుండా ఉండేందుకు ప్లానోఫిక్స్ 5 ఎంఎల్ 20 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. మామిడి గోలికాయ సైజులో ఉన్నపుడు మామిడి చెట్ల పాదుల్లో యూరియా, పొటాష్ ఎరువులను వేయాలి.

ఆశలు పెరిగాయి



ఈ ఏడాది మామిడి తోటలు సంతృప్తికరంగా ఉన్నాయి. డిసెంబరు నెల నుంచే మామిడిలో పూత వచ్చింది. ముందుగా వచ్చిన పూత, పిందె రాలే అవకాశం ఉండదు. అందువల్ల ఈ సారి మామిడిపై నమ్మకం ఎక్కువగా ఉంది. మాకు 10 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పూత వచ్చింది. పూత లేని చెట్లు లేదు. ఈ సారి కాపు కూడా ముందుగా వచ్చే అవకాశం ఉంది. ధరలపై కూడా నమ్మకం ఉంది.

– వెంకటసుబ్బారెడ్డి, మామిడి రైతు, పాలకొలను, ఓర్వకల్ మండలం

పూత సంతోషాన్ని ఇస్తోంది



మామిడితో వచ్చిన పూత అంతులేని సంతోషాన్ని ఇస్తోంది. నాలుగైదు ఏళ్లలో ఎప్పుడూ ఈ స్థాయిలో పూత రాలేదు. ఈ సారి మంచి సమయంలో పూత రావడం విశేషం. ముందుగా వచ్చిన పూత నిలువడుతుంది. మాకు 5.50 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఎక్కువగా బేనీసా చెట్లు ఉన్నాయి. ఈ సారి ఎకరాకు 8 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. నాణ్యతను పెంచుకోవడానికి ఉద్యాన శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తున్నాం.

– రామయ్య, రామళ్లకోట, వెల్దుర్తి మండలం

మామిడికి ఢోకా లేదు



గతేడాది మామిడిలో దిగుబడులు 25 శాతం కూడా లేవు. పూత ఆలస్యంగా రావడం వల్ల గాలులు, ఉష్ణోగ్రతలకు రాలిపోయింది. ఈ సారి మంచి సమయంలోనే పూత వచ్చింది. ఈ సమయంలో వచ్చిన పూత రాలే అవకాశం ఉండదు. ఇందువల్ల ఈ సారి మామిడికి ఢోకా ఉండదు. ఫ్రూట్ కవర్లు వినియోగిస్తే కాయలో నాణ్యత వస్తుంది.

–పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

సీహెచ్‌ఓల ఆత్మీయ సమ్మేళనం

కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ వైఎస్ఆర్ గ్రామీణ వైద్యశాలల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్ఓ)లుగా పనిచేస్తున్న వారు ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఏపీ రాష్ట్ర ఎంఎల్‌హెచ్‌పీ/కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ అసోసియేషన్ కర్నూలు జిల్లా అధ్యక్షులు సుజాత మాట్లాడుతూ నూతనంగా విధుల్లో చేరిన వారిని అభినందించారు. వారికి వృత్తిరీత్యా కావాల్సిన సలహాలు, సూచనలు అందించారు. విధి నిర్వహణలో ఉన్న కొన్ని సమస్యలు గురించి చర్చించి పరిష్కారం దిశగా ముందుకు వెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చందన, భాస్కర్, సెక్రటరీ అహమ్మద్ బాషా, జాయింట్ సెక్రటరీ శివకృష్ణ, గురుప్రాద్, ఫైనాన్స్ సెక్రటరీ దివ్య, కార్తీక్, జిల్లా సమన్వయ కర్త రాజేష్ ఆచారి, రాష్ట్ర సమన్వయ కర్త వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఎవరికీ వారే!

- భూమా జయంతి వేడుకల్లో బయటపడిన విభేదాలు
- వేర్వేరుగా కార్యక్రమాల నిర్వహణ
- కార్యకర్తల్లో అసంతృప్తి



మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఫొటో లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా టీడీపీలో మరోసారి విభేదాలు బయటపడ్డాయి. మాజీ ఎంపీ భూమా నాగిరెడ్డి జయంతి కార్యక్రమాలను ఆయన కుటుంబీకులు వేర్వేరుగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి తన నివాసం వద్ద రక్తదానం, అన్నదానం చేపట్టారు. భూమా కుమార్తె మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, తమ్ముడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిలు పద్మావతి నగర్‌లోని వారి సొంత స్థలంలో రక్తదానం, అన్నదానం చేశారు. దీంతో భూమా కార్యకర్తల్లో సందిగ్ధత నెలకొంది. ఏ కార్యక్రమానికి హాజరు కావాలో అర్థం కాగా అయోమయంలో పడ్డారు. ఒకరి కార్యక్రమానికి వెళితే మరొకరితో భేదాభిప్రాయాలు వస్తాయని తెలిసి మిన్నకుండి పోయారు. ఇక భూమా తన ప్రాణ స్నేహితుడని చెప్పుకునే ఏవీ సుబ్బారెడ్డి ఎవరి కార్యక్రమానికి హాజరు గాక పోగా తాను కూడా ఎటువంటి కార్యక్రమం తలపెట్టలేదు. కనీసం పట్టణ సీనియర్ నాయకులు టీడీపీ నేత ఎమ్మెల్సీ ఎన్ఎమ్‌డీ ఫరూక్ కూడా ఏ కార్యక్రమానికి హాజరు కాలేదు. నాయకుల మధ్య విభేదాలతో భూమా అభిమానుల్లో కొంత నిరుత్సాహం కనిపించింది.

సానుకూల దృక్పథంతో మనసుకు ఊరట

- సైకియాట్రిస్ట్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి



ఇండ్ల రామసుబ్బారెడ్డికి మెమెంటో అందజేస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): సానుకూల దృక్పథంతోనే మనసుకు ఊరట లభించి, మనిషి ఆరోగ్యంగా ఉండగలడని విజయవాడకు చెందిన మానసిక వైద్యనిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా నిర్వహించిన నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు(సీఎంఈ)లో ఆదివారం ఆయన 'తెలుగు సినిమాల్లో మనసు పాటలు–మానసిక విశ్లేషణ' అనే అంశంపై ప్రసంగించారు. సినీ కవి చెప్పినట్లు జరిగేవన్నీ మంచికని, అనుకోవడమే మనిషి పని అని జీవించాలని చెప్పారు. అనంతరం డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ వెంకటరంగారెడ్డి, డాక్టర్ ఏవీఎస్ రెడ్డి, డాక్టర్ ఎం. బాబయ్య, డాక్టర్ టి. సదాశివరెడ్డి, డాక్టర్ పి. కాంతారెడ్డి, డాక్టర్ పి. సుధాకర్, డాక్టర్ బెల్లంకొండ కె. కిశోర్, డాక్టర్ రామసుబ్బారెడ్డి, ధరణిరెడ్డి వివిధ అంశాలపై ప్రసంగించారు. వీరిని పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నరసింహులు, డాక్టర్ ఎస్. మునీరుద్దీన్, డాక్టర్ గెలివి సహదేవుడు, డాక్టర్ బాలమద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ టెన్నిస్ విజేత రామ్ ధీరజ్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాయలసీమ స్థాయి అండర్–10 టెన్నిస్ టోర్నీ విజేతగా కర్నూలుకు చెందిన రామ్ ధీరజ్ నిలిచాడు. కడపకు చెందిన తేజ రన్నరప్ సాధించాడు. అనంతపురం శివారులోని ప్రైవేటు టెన్నిస్ అకాడమీల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రామ్ ధీరజ్ 4–1 స్కోరుతో తేజపై విజయం సాధించాడు. ఈ చిన్నారి గతేడాది నిర్వహించిన అండర్–10 టోర్నీలోనూ విజేతగా నిలవడం విశేషం. అలాగే అండర్–12 బాలుర విభాగంలో కశిష్ కార్తికేయ (అనంతపురం), అండర్–14 బాలికల విభాగంలో గీతిక జోషిప్రియ రెడ్డి (అనంతపురం) విజేతలుగా నిలిచారు.

యువకుడి బలవన్మరణం



మృతి చెందిన శేఖర్

ఓర్వకల్లు: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని హుసేనాపురం గ్రామంలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని జంగాలపేటకు చెందిన పూసల పెద్ద మద్దిలేటి, ఓబులమ్మ దంపతులకు ఆరుగురు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులందరూపూసల వ్యాపారం చేసుకొని జీవనం సాగించేవారు. ఈ క్రమంలో ఐదుగురు కొడుకులు తెలంగాణలోని జడ్చర్లకు వ్యాపారరీత్యా వలస వెళ్లారు. చిన్న కుమారుడు శేఖర్(22)కు జంగాలపేటకు చెందిన లలితమ్మతో నాలుగేళ్ల క్రితం పెళ్లయింది. అయితే ఇంత వరకు సంతానం కలుగలేదు. నాలుగు నెలల క్రితం తెలంగాణలోని పెబ్బేరుకు వీరు వలస వెళ్లారు. రెండు రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన శేఖర్ ఆదివారం ఉదయం స్వగ్రామానికి చేరుకొని ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందాడు. శేఖర్ భార్య లలితమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల విజేత కర్నూలు



విజేతగా నిలిచిన కర్నూలు జట్టు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండురోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి శాప్ లీగ్ కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్స్‌లో నెల్లూరు జట్టుపై 40–31 పాయింట్లతో కర్నూలు జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. మూడో స్థానంలో శ్రీకాకుళం, కాకినాడ జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు బహుమతులు అందజేశారు.

కేసీ సబ్ చానల్‌లో గుర్తు తెలియని మృతదేహం

ఆళ్లగడ్డ: మండలంలోని గూబగుండం గ్రామ సమీపంలో కేసీ కెనాల్ సబ్ చానల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు రూరల్ పోలీసులు ఆదివారం గుర్తించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. పూర్తిగా కుళ్లిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉందని ఎస్ఐ నరసింహులు తెలిపారు. మృతి గల కారణాలపై విచారణ జరుపుతున్నామన్నారు.

నల్లమలలో ఎంఈఈ టీం పర్యటన

పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్యంలోని వనాలు, వన్యప్రాణులను సంరక్షించటంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని మేనేజ్‌మెంట్ ఎఫెక్టివ్‌నెస్ ఎవల్యూషన్ (ఎంఈఈ) టీం సభ్యులైన రిటైర్డు పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్)లు మెహరోత్ర, వాసు, ఉపాధ్యాయ్‌లు అటవీశాఖ అధికారులకు సూచించారు. ఆదివారం ప్రకాశం, నంద్యాల జిల్లాలోని నల్లమల అభయారణ్యంలో అన్ని ముఖ్య ప్రాంతాల్లో వారు పర్యటించారు. గిద్దలూరు రేంజి పరిధిలోని పచ్చర్ల, నంద్యాల జిల్లా ఆత్మకూరు పరిధిలోని బైర్లూటి, పెద్దదోర్నాల పరిధిలోని తుమ్మలబైలు ఎకోటూరిజం కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీసీఎఫ్ శ్రీనివాసరెడ్డి, ఆత్మకూరు, గిద్దలూరు, మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్‌లు అలెన్ చాంగ్ టెరాన్, నరసింహారావు, విఘ్నేష్ అపావు, బయోడైవర్సిటీ ఏసీఎఫ్ ధనరాజ్, పెద్దదోర్నాల రేంజి అధికారి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లి ఫాతిమా

- సావిత్రి బాయి పూలేతో కలిసి ఓనమాలు దిద్దించిన మహిళ
- భౌతిక దాడులు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో కదిలిన వనిత
- సేవలను గుర్తించి ఆమె చరిత్రను పాఠ్యాంశంగా చేర్చిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆధునిక భారతదేశ తొలి ముస్లిం ఉపాధ్యాయురాలిగా చరిత్రలో స్థానం
- నేడు షేక్ ఫాతిమా జయంతి



షేక్ ఫాతిమా

కర్నూలు(రాజ్‌విహార్): అసమానతల సమాజంలో ఆమె అక్షరమై వెలిగారు. అడుగడుగునా వివక్ష ఎదుర్కొంటూనే బాలికా విద్య కోసం అహోరాత్రులు శ్రమించారు. భౌతిక దాడులను సైతం లెక్కచేయకుండా ఇంటినే పాఠశాలగా మార్చారు. భారత దేశ తొలి ముస్లిం ఉపాధ్యాయురాలిగా షేక్ ఫాతిమా ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. సోమవారం ఆమె జయంతి. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..

మహారాష్ట్రలోని పూణేలో 1831 జనవరి 9న జన్మించిన షేక్ ఫాతిమా చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయారు. దీంతో అన్న ఉస్మాన్ పర్యవేక్షణలో ఆమె పెరిగారు. బంధువు మున్షి గఫార్ సంరక్షణలో పూణేలోని గంజిపేట్‌లో ఉంటూ ఉర్దూ చదవడం, రాయడం నేర్చుకున్నారు. బాలికలకు విద్య నేర్పించేందుకు పూలే దంపతులు ఉస్మాన్ సహకారం కోరగా.. వారి లక్ష్య సాధనకు తాను సైతం అంటూ ఫాతిమా ముందుకు కదిలారు. ముస్లిం అయినప్పటికీ పూలే దంపతుల మార్గదర్శకంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బాలికల విద్య కోసం నిరంతరం శ్రమించారు.

మిషనరీ పాఠశాలలో శిక్షణ

షేక్ ఫాతిమా అహ్మద్‌నగర్‌లోని మేడం సింథియా ఫెరారే మిషనరీ పాఠశాలలో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. ఇందులో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ గుర్తింపు కలిగిన అధికారిక ఉపాధ్యాయ శిక్షణాలయంలో ఉపాధ్యాయవృత్తి విద్యా శిక్షణ పొందిన తొలి ముస్లిం మహిళగా పేరు పొందారు. ఉర్దూ, ఇంగ్లిష్ భాషలపై పట్టు ఉన్నా.. సావిత్రిబాయి పూలే వద్ద మరాఠి నేర్చుకొని పిల్లలకు పాఠాలు బోధించారు.

దాడులకు బెదరని వీర వనిత

బాలికా విద్యకు స్వచ్ఛందంగా సేవలందించేందుకు ముందుకు వెళ్తున్న ఫాతిమా బెదిరింపులు, భౌతిక దాడులు ఎదుర్కొన్నారు. అయినా బెదరకుండా సావిత్రీబాయితో కలిసి బాలికా విద్య కోసం కృషి చేశారు. అవస్థలు ఎదురైనా మరింత ఆత్మ విశ్వాసంతో, ఎంతో ధైర్యంతో ముందుకు వెళ్లారు. సమాజం నుంచి దారుణమైన రీతిలో అసమ్మతిని, అవమానాన్ని, తిరుగుబాటును ఎదుర్కొన్నా బలంగా నిలిచిన ఆదర్శ ఉపాధ్యాయురాలిగా ఫాతిమా నిలిచారు.

సేవల్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం

బాలికా విద్య కోసం ఎంతో కృషి చేసిన ఫాతిమా షేక్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. 8వ తరగతి పుస్తకాల్లో ఆమె జీవిత చరిత్రను చేర్చింది. ఫాతిమా అందించిన సేవలు, పడిన కష్టాలను తెలుగు పాఠ్య పుస్తకంలో చేర్చి తగిన గౌరవం కల్పించింది.

విగ్రహాన్ని ఏర్పాటు చేశాం



ఎన్నో అవమానాలు, దాడులు ఎదురైనా ఫాతిమా పట్టు సడలలేదు. అప్పట్లో ఆమె నాటిన బీజం కారణంగా నేడు మహిళలు ఉన్నత విద్యావంతులై అంతరిక్షం వరకు వెళ్లగలుగుతున్నారు. ఫాతిమా ఆశయ సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. దేశంలోనే తొలిసారిగా ఆమె విగ్రహాన్ని ఎమ్మిగనూరులోని హైస్కూల్‌లో ఇటీవలే ఏర్పాటు చేశాం.

– నక్కలమిట్ట శ్రీనివాసులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి

అక్షర జ్ఞానం ఇచ్చారు



సావిత్ర బాయి పూలేతో కలిసి ఫాతిమా అణగారిన వర్గాలకు అక్షర జ్ఞానం కల్పించారు. ఈ క్రమంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారు. అయినా బెదరకుండా లక్ష్యం వైపు వెళ్లారు. ఆమె సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. పాఠ్యపుస్తకంలో ఫాతిమా జీవిత చరిత్రను చేర్చడం అభినందనీయం.

– సయ్యద్ నజీర్ అహమ్మద్, ఫాతిమా షేక్ పుస్తక రచయిత

జయంతిని అధికారికంగా నిర్వహించాలి



దేశానికి స్వాతంత్ర్యం రాక ముందే సావిత్రి బాయి పూలేతో కలిసి బాలికా విద్య కోసం ఫాతిమా తపించారు. 1848లో మొదటి బాలికల పాఠశాలను ఏర్పాటు చేశారు. ఆ రోజుల్లో ఎన్నో అవమానాలు, దాడులు ఎదురైనా వెనక్కి తగ్గకుండా లక్ష్యం వైపు వెళ్లిన ఫాతిమా జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలి.

– పట్నం రాజేశ్వరి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళ ఐక్య వేదిక వ్యవస్థాపకురాలు

ఎందరికో స్ఫూర్తి



సుమారు 180 ఏళ్ల క్రితమే బాలికా విద్య కోసం తపించిన వీర వనిత ఫాతిమా. ఆధునిక భారత దేశంలో తొలి ముస్లిం ఉపాధ్యాయురాలిగా ఉంటూ ఆమె చిన్నారులకు ఓనమాలు దిద్దించారు. ఫాతిమా షేక్‌ను ఆదర్శంగా తీసుకొని నేనూ ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నాను.

– యాస్మిన్, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు